## చిన్నకథ

# కొన్ని జీవితాలంతే....

-రాచపూటి రమేష్



హఠాత్తుగా రామ్మూర్తిని ఆ గదిలో చూసి ఆశ్చర్యపోయాను నేను.

ఉద్యోగ రీత్యా కడపకు బదిలీ అవడంతో తాత్కాలికంగా ఉండడానికో గది కోసం వెతుకుతున్నాను నేను. నాలుగైదు రూమ్‌లు చూశాక, నాగరాజు పేటలో పదిగదులున్న కాంప్లెక్స్ ఒకటి ఉందని ఎవరో చెప్పడంతో, అక్కడకు వచ్చాను. కాంప్లెక్స్‌లో ఓ గది ఖాళీగానే ఉంది. ఓనరుతో అద్దె విషయం మాట్లాడుతూ ఉండగా, కార్నర్‌లో ఉన్న ఓ గది నుంచి హఠాత్తుగా బయటకు వచ్చాడు రామ్మూర్తి. ఆ గది మా ఆఫీసుకు దగ్గరగానే ఉండడంతో, దాన్నే సెటిల్ చేసుకున్నాను. ఆ మూలగది అద్దెకు తీసుకొని ఒంటరిగా ఉంటున్నాడు రామ్మూర్తి. భార్యా పిల్లలు తిరుపతిలో ఉండగా, రిటైరైన రామ్మూర్తి ఒక్కడే కడపలో ఎందుకు గది అద్దెకు తీసుకొని ఉంటున్నట్లు? అదే విషయం అడిగానతన్ని.

''నా ప్రావిడెంట్ ఫండు అకౌంటులో పది లక్షలున్నాయి. ఇల్లు నా పేరునే ఉంది. వాటి కోసం గద్దల్లా కాచుకుని కూర్చుని ఉన్నారు నా భార్యా, పిలకాయలు, ఇంకా కొందరు బంధువులు కూడా. తిరుపతిలో వాళ్లతో బాటు నేనుంటే డబ్బు కోసం కాకుల్లా పీడిస్తారు. అందుకే ఎవరికీ తెలియకుండా ఇక్కడ ఉంటున్నా. నేనిక్కడుంటున్నట్లు ఎవ్వరితో పొరబాటున కూడా అనకు'' అన్నాడు రామ్మూర్తి నాతో.

రామ్మూర్తి మాటలు, అతని తత్వం తెలిసిన నాకు వింతగా ఏమీ అనిపించలేదు. ఎనిమిదేళ్ల పాటు, నేను, రామ్మూర్తి సహోద్యోగులం. జీతం డబ్బులను ఆచితూచి ఖర్చు పెట్టడంలో రామ్మూర్తిది అందెవేసిన చేయి. అద్దె తక్కువని రేణిగుంటలో ఓ పాత ఇల్లు, బాడుగకు తీసుకున్నాడు. రోజూ టౌన్ బస్సులో తిరుపతికి వచ్చి, బస్టాండు నుంచి రెండు కిలోమీటర్లు నడిచి ఆఫీసుకు వచ్చేవాడు. అతని క్యారేజ్‌లో పచ్చడి మెతుకులు తప్ప మరేమీ దర్శనమిచ్చేది కాదు. ఒకవేళ ఎప్పుడైనా క్యారేజ్ తేకపోయినా, రోడ్లన్నీ వెతికి, ఏ బండి మీదో అమ్మే ఇడ్లీలను చౌకగా వస్తుందని తినేవాడు.

ఆఫీసులో ఓవర్ టైము పని చేసినందుకు అలవెన్సు ఇస్తున్నారని రాత్రి ఏడు, ఎనిమిది వరకూ ఆఫీసులోనే పని చేసేవాడు. ఒకసారి ఆఫీసు పని మీద నేను, అతను చిత్తూరుకు వెళ్లవలసి వచ్చింది. పని ముగిసిన తరువాత వీధులన్నీ తిప్పి ఓ పాక హోటల్లోకి తీసుకెళ్లాడు నన్ను. 'ఇక్కడ భోజనం మిగిలిన హోటళ్ల కన్నా ఆరు రూపాయలు తక్కువ, టేస్టుకేమీ తీసిపోదు' అన్నాడు. నాకక్కడ ముద్ద మింగుడు పడలేదు. తిరిగి తిరుపతి వెళ్లేటప్పుడు 'చంద్రగిరిలో దిగి టౌన్ బస్సులో వెళదాం. మూడు రూపాయలు మిగులుతాయి' అన్నాడు రామ్మూర్తి. నేను అవాక్కయ్యాను.

ఆఫీసులో లేట్ అవర్స్ ఉంటూ రామ్మూర్తి భార్యా, పిల్లల గురించి పట్టించుకున్నట్లు లేదు. అతని కొడుకు జులాయిగా తిరుగుతున్నట్లుగా తెలిసింది మాకు. కూతురు ఇంటర్ రెండు సార్లు ఫెయిలయింది. ఓసారి అతని భార్యకు బాగాలేక హాస్పిటల్లో చేర్చి సెలైన్ ఎక్కిస్తున్నట్లు ఫోన్ వచ్చింది రామ్మూర్తికి. అయినా ఓటీలో వచ్చే డబ్బులు వదులుకోకూడదని ఆఫీసులోనే ఎనిమిది గంటల వరకూ ఉండి వెళ్లాడు రామ్మూర్తి. అతని ప్రవర్తనను అందరూ ఏవగించుకున్నారు. జీతంలో సగం డబ్బులు జీపిఎఫ్ ఖాతాలోనే కూడబెట్టేవాడు రామ్మూర్తి. భార్యా భర్తలిద్దరూ ఉద్యోగస్థులైనా వారు కూడా రామ్మూర్తి పిఎఫ్ ఖాతాలో ఉన్న డబ్బు చూసి కళ్లు తేలేసే వారు. 'పొదుపుకు, పీనాసితనానికి తేడా ఉంది' అనుకునేవారు.

కడపలో కూడా రామ్మూర్తి ధోరణిలో పెద్దగా తేడా ఏమీ లేదు. ఓ మారుమూల ఉన్న చిన్న రేకుల షెడ్డుల హోటల్లోనే టిఫిను, భోజనం తినేవాడు. సర్వీసులో ఉన్న వారెవరైనా అడిగితే వారి బిల్లులు క్లెయిమ్స్ వగైరా తయారు చేసి డబ్బులు తీసుకొనేవాడు. ఎవర్నీ ఒక పట్టాన నమ్మని ఆయన ఎవరినీ దగ్గరకు రానిచ్చేవాడు కాదు. నాలుగు రోజులు వరుసగా శలవులు రావడంతో తిరుపతికి నేను వెళ్లొచ్చేసరికి రామ్మూర్తి గదికి తాళం బిడాయించి ఉంది. అతని గురించి అడిగాను కాంప్లెక్స్ పక్కనే ఉన్న కిరాణా కొట్టువాడిని.

''రామ్మూర్తిగారి కొడుకు వచ్చి నానా రభస చేసి, తండ్రితో గది ఖాళీ చేయించి వెంట తీసుకెళ్లాడు సార్. అతని పాస్ బుక్, ఏటిఎం కార్డు బలవంతంగా లాక్కున్నారు. అయినా హాయిగా పెళ్లాం పిల్లలతో కాలక్షేపం చేయకుండా ఆ పెద్దాయనకిదేం రోగం సార్'' అన్నాడతను.

రామ్మూర్తిలాంటి వాళ్లకు డబ్బు ఖర్చు చేయాలంటే ప్రాణం విలవిలాడుతుందేమో! అనుకొన్నాను. కానీ నాలుగైదునెలల తరువాత, మళ్లీ హఠాత్తుగా రామ్మూర్తి ప్రత్యక్షమై మళ్లీ అదే గది అద్దెకు తీసుకొన్నాడు.

రామ్మూర్తి అకౌంట్ నుంచి డబ్బులు మొత్తం డ్రా చేసి, అతని కొడుకు స్వంతంగా వ్యాపారం పెట్టుకొన్నాడట. కూతురికి మంచి కట్నమిచ్చి అతని భార్యే పెళ్లి జరిపించిందట. ఆ తరువాత ఆమె కూడా ఏదో కార్పొరేట్ ఆస్పత్రిలో చేరి ఆరోగ్యం బాగు చేసుకున్నదట. మొత్తానికి రామ్మూర్తి బ్యాంకు బాలెన్సు ఖాళీ అయ్యిందట.

''ఇప్పుడు వాళ్లకు నాతో పనిలేదు. నా పెన్షన్ డబ్బులు నాకు చాలు. ఒంటరిగా ఇక్కడే ప్రశాంతంగా ఉంది'' అన్నాడు రామ్మూర్తి. అతను బలవంతంగా కాక, స్వచ్ఛందంగా కుటుంబం కోసం తాను కూడబెట్టిన సొమ్ము ఖర్చుపెట్టి వుంటే, వారి కుటుంబంలో ఇన్ని పొరపొచ్చాలు వచ్చేండేవి కావేమో అనిపించింది నాకు. 'కానీ ఏం చేస్తాం? కొన్ని జీవితాలంతే' అనుకున్నాను.

*


చిరునామా
10/585, బెల్లం మండి వీధి,
వినాయకుని గుడి వద్ద,
కడప-516001
సెల్: 9866727042